

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 3 ఏప్రిల్ 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధ) సా.6.25
సహారీ (గురు) ఉ.4.34

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	28



నేడు చంద్రబాబు ప్రజాగళం

రావులపాలెం, రామచంద్రపురంల్లో బహిరంగ సభలు

రేపు కొవ్వూరు, గోపాలపురంల్లో...

అమలాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తొలిసారిగా టీడీపీ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రజాగళం పేరుతో ఎన్నికల సభల్లో పాల్గొననున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం, రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ద్రాక్షారామ బహిరంగ సభలకు అశేష జనవాహినిని తరలించేందుకు టీడీపీ కూటమి శ్రేణులు కృషి చేస్తున్నాయి. ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న టీడీపీ నేతలు జన సమీకరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీశ్‌మాధుర్, కొత్తపేట, రామచంద్రపురం అసెంబ్లీల టీడీపీ అభ్యర్థులు బండారు సత్యానందరావు, వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. కొత్తపేటలో జరిగిన సమావేశంలో చంద్రబాబు సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు నిర్వాహకులు దిశానిర్దేశం చేశారు. రావులపాలెం సెంటర్లోని కెనాల్ రోడ్డులోను, ద్రాక్షారామలోని బోసుబొమ్మ సెంటర్ మూడు రోడ్ల కూడలిలో సభల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. చంద్రబాబు పర్యటన ద్వారా కోనసీమ జిల్లాలో కూటమి కేడర్‌లో జోష్ పెరగనుంది.

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో బయలుదేరి 1.20కు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కి వస్తారు. 2.30 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌కి వస్తారు. 2.50కు హెలికాప్టర్‌లో బయలుదేరి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట గ్రామ సమీపంలోని మల్లయ్యదొడ్డి వద్ద హెలిపాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి రావులపాలెం టీడీపీ ఆఫీస్ సెంటర్‌కు చేరుకుంటారు. సాయంత్రం 3.30 నుంచి 5 వరకు బహిరంగసభలో పాల్గొంటారు. 5.15కు రోడ్డు మార్గంలో బయలుదేరి రామచంద్రపురం మండలం ద్రాక్షారామలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహం దగ్గరకు చేరుకుంటారు. అక్కడ రాత్రి 7 గంటల నుంచి 8.30 వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 8.45కు రోడ్డు మార్గాన బయలుదేరి రామచంద్రపురం వీఎస్ఎం కాలేజీకి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 4న 10.25కు రోడ్డు మార్గన బయలుదేరి వీఎస్ఎం కాలేజీ గ్రౌండ్‌లో 10.30 నుంచి 1 వరకు జరిగే సభలో పాల్గొంటారు. భోజనం విరామం తర్వాత 2 గంటలకు రామచంద్రపురం 16 వార్డులోని కోరుకొండ రామకృష్ణ లేఅవుట్ హెలిపాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కొవ్వూరులోని జరిగే బహిరంగ సభకు వెళతారు. అనంతరం రాత్రి నల్లజర్లలో జరిగే సభలో బాబు పాల్గొంటారు.



మీ మావయ్య వచ్చాడు: చిన్నారిని భుజంపై ఎత్తుకుని నడుస్తున్న పవన్..పట్టరాని ఆనందంలో బాలిక తల్లి



మరువం సార్: చర్చిలో పవన్‌కు పాస్టర్స్ సన్మానం



దర్గాలో ప్రార్థనలు

అదిరిన రోడ్ షో

జనం జేజేలు



హత్తుకున్న..అభిమానం.. దగ్గరైన దూరం: పిఠాపురాన మహిళను ఓదార్చుతున్న పవన్

మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)/ పిఠాపురం/యు.కొత్తపల్లి: మండుటెండలోనూ ఆప్యాయ పలకరింపులు... దారిపొడవునా అభివాదాలు... రైతులతో ముచ్చట్లు... గ్రామస్థులతో మాటామంతీలు... మహిళలతో సరదా స్టెప్పులు.. విద్యార్థులతో సెల్ఫీలు.. కలవడానికి వేచిచూస్తున్న ప్రతి ఒక్కరినీ చూసి చిరునవ్వులు.. కారు ఆపి యోగక్షేమాల ఆరాలు.. కష్టాల్లో ఉన్నామని కలవడానికి వచ్చిన దివ్యాంగులకు ధైర్యవచనాలు.. ఇలా జనసేనాని జనం బాటపట్టారు. మీ చెంతకే వస్తున్నానంటూ సామాన్య నాయకుడి మాదిరి వెళ్లి కలిశారు.. దీంతో జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్ కల్యాణ్ నాలుగో రోజు పర్యటన సూపర్ హిట్ అయ్యింది. ఆరున్నర గంటలపాటు సుమారు 30 కిలోమీటర్ల మేర మంగళవారం పవన్ నిర్వహించిన భారీ రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా హారతులు పట్టారు.. పూలవాన కురిపించారు. వీరందరికీ పవన్ అభివాదం చేస్తూ నిర్విరామంగా రోడ్డుషో నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన రోడ్‌షో సాయంత్రం 4.30 గంటలకు ముగిసింది. గోకులం గ్రాండ్ హోటల్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూటమి పార్టీల నాయకులు, నియోజకవర్గ నేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గొల్లప్రోలు హెలిపాడ్ నుంచి మంగళవారం రాత్రి పవన్ రోడ్డుమార్గాన రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వెళ్లి అక్కడి నుంచి అమరావతి బయలుదేరారు. మరోపక్క మంగళవారంతో పవన్ నాలుగురోజుల పిఠాపురం పర్యటన ముగిసింది. తిరిగి 8న రానున్నారు.

- పిఠాపురంలో పవన్‌కు బ్రహ్మరథం
- 30 కి.మీ. మేర మండుటెండలో రోడ్‌షో
- ఆరున్నర గంటల పాటు ఏకధాటిగా..
- దారి పొడవునా నీరాజనం
- ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ముందుకు..
- కొత్తపల్లిలో సమావేశం అడ్డగింత
- నులక మంచంపై కూర్చుని మాటామంతీ
- మూలపేటలో సరదాగా స్టెప్పులు
- పెరిగిన పోలీసు బందోబస్తు
- ముగిసిన జనసేనాని పర్యటన.. మళ్లీ 8న రాక



యు.కొత్తపల్లిలో పవన్‌కు జ్ఞాపిక

48 గంటల ముందే దరఖాస్తు.. అయిననూ అనుమతిలేదు..

యు.కొత్తపల్లి సురక్ష ఫంక్షన్ హాలులో ఉప్పాడ, కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం తదితర గ్రామాలకు చెందిన జనసేన వీరమహిళలతో పవన్‌కల్యాణ్ సమావేశం ఏర్పాటు చేశారు. కాసేపట్లో పవన్ ప్రసంగిస్తారనగా ఎన్నికల అధికారులు అడ్డంకులు కల్పించారు. 48 గంటల ముందే జనసేన వర్గాలు సమావేశం అనుమతికి దరఖాస్తు చేశారు. రోడ్‌షోకు, ఇతర సమావేశాలకు అనుమతిచ్చారు. కానీ కొత్తపల్లి సమావేశానికి అనుమతి లేదని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వచ్చి చెప్పారు. పవన్ కల్యాణ్ అధికారులతో చర్చించిన తర్వాత సమావేశం రద్దుకు జనసేన నిర్ణయించింది. చివరకు ఐదు నిమిషాలు మాట్లాడి సమావేశాన్ని ముగించారు. పిఠాపురం తన స్వస్థలమని.. తాను ఇక్కడే ఉంటానన్నారు. త్వరలో సమావేశం నిర్వహించి అందరి కష్టాలు వింటానని మాటిచ్చారు.



మీ బాగు కోసమే వస్తున్నా: రైతుతో పవన్ మాటామంతీ

వే..ఆటోవాన్ని: ఆటో డ్రైవర్‌తో పవన్

ఏమ్మా.. నేను మీ తమ్ముడిని.. నేలపై కూర్చుని పలకరింపు

పట్టలేని ఆనందం.. పవన్ పలకరింపుతో పులకింత

వెల్లువెత్తిన.. అభిమాన పవనాలు

పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పవన్ తొలిసారిగా ఆరున్నర గంటలపాటు ఏకబిగిన 30 కిలోమీటర్ల మేర రోడ్డుషో నిర్వహించారు. మండుటెండలో సైతం ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. కిలోమీటర్ల కొద్దీ ప్రజలు బారులు తీరారు. తమ అభిమాన నేతను చూసేందుకు గంటల తరబడి ఎదురుచూశారు. హైదరాబాదు నుంచి గొల్లప్రోలులోని హెలిపాడ్‌లో ఉదయం 9.50 గంటలకు దిగిన పవన్‌కల్యాణ్ నేరుగా పిఠాపురం పట్టణం చేరుకుని పశువుల సంత నుంచి రోడ్‌షో ప్రారంభించారు. అగ్రహారం, ఆర్టీసీ కాంప్లెక్స్, మెయిన్‌రోడ్డు మీదుగా ఆంధ్రా బాప్టిస్టు సెంటినరీ చర్చికి చేరుకుని అక్కడ ప్రార్థనలు చేశారు. బైబిల్ సూక్తులు అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. తన భార్య క్రిస్టియన్ అని గుర్తుచేశారు. చర్చిలో ఒక మహిళ తన కష్టాలను పవన్‌కల్యాణ్‌కు విన్నవించింది. ఆమెకు అండగా ఉంటానని పవన్ భరోసా ఇచ్చారు. కొందరు అభిమానులు పవన్‌కు టీగ్లాస్ సెట్ బహుమతిగా అందించారు. అక్కడి నుంచి బయలుదేరి మాధవపురం, ఉప్పరగూడెం, నాగులాపల్లి గ్రామాల మీదుగా పవన్ మధ్యాహ్నం 12 గంటలకు పొన్నాడ చేరుకున్నారు. పొన్నాడ వీధుల్లో నడుచుకుంటూ బషీర్ బీబీ ఔలియా (బంగారుపాప) దర్గాకు చేరుకున్నారు. మార్గమధ్యంలో కొబ్బరి బొండాలు అమ్మే వ్యక్తితో మాట్లాడారు. పొన్నాడలో ఓ ఇంటి వద్ద నులక మంచంపై కూర్చుని ముచ్చటించారు. అక్కడే నాగులాపల్లికి చెందిన కొత్త జంట పెళ్లి వస్త్రాల్లోనే పవన్ వద్దకు వచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బషీర్‌బీబీ దర్గాలో ప్రార్థనలు చేశారు. చాదర్ వస్త్రాలు సమర్పించారు. అనంతరం మూలపేట జంక్షన్, బీచ్ రోడ్డు, అమీనాబాదు, ఉప్పాడ గ్రామాల మీదుగా కొత్తపల్లి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు అపూర్వ రీతిన స్వాగతం పలికారు. వారందరికీ కారు ఓపెన్‌టాపు నుంచి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. పలుచోట్ల కారు ఆపి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వాకతిప్ప, యండపల్లి జంక్షన్ల మీదుగా కొండెవరం చేరుకున్నారు. అక్కడ ప్రజలు భారీగా తరలిరావడంతో కారు దిగి గ్రామంలో నడిచారు. మహిళలతో స్టెప్పులు వేశారు. చిన్నారులు పవన్‌ను అలింగనం చేసుకున్నారు. నవఖండ్రవాడ మీదుగా పిఠాపురంలోని డ్రైవర్స్ కాలనీకి చేరుకున్నారు. అక్కడ పలుచోట్ల కారు ఆపి కిందకు దిగి వివిధ వర్గాల ప్రజలతో మాట్లాడారు. మండుటెండలో తిరుగుతున్న పవన్‌కు రైతులు కొబ్బరిబొండాలు అందించారు. ఉప్పాడ రైల్వేగేటు, బంగారమ్మరావిచెట్టు సెంటర్, సినిమా సెంటర్, పాతబస్టాండు, అంబేడ్కర్ సెంటర్, ప్రభుత్వాసుపత్రి సెంటర్, పోలీస్‌స్టేషన్, పాదగయ సెంటర్, జగ్గయ్యచెరువు కాలనీ మీదుగా కుమారపురం చేరుకున్నారు. గ్రామంలో రోడ్ షో నిర్వహించి తాను బస చేసే గోకులం గ్రాండ్‌కు చేరారు. తన సొంత నియోజకవర్గం పిఠాపురం నుంచే గత నెల 30న పవన్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి మంగళవారం ముగించారు. పవన్ తొలి విడత నాలుగు రోజుల పర్యటనతో జనసేనతో పాటు టీడీపీ, బీజేపీ వర్గాల్లో జోష్ నెలకొంది.



పవన్ వెంట: పవన్‌తో నాగబాబు, సుజనా చౌదరి, వర్మ, గిరీష్, కామినేని శ్రీనివాస్, చినరాజప్ప తదితరులు

పెరిగిన బందోబస్తు..

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం నాటి పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమానుల ముసుగులో కొందరు కిరాయి మూకలు వచ్చి నన్నని బ్లేడుతో తనను, తన సెక్యూరిటీని కోస్తున్నారని, ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసుకదా అంటూ సోమవారం జరిగిన సమావేశంలో పవన్ సంచలన వాఖ్యలు చేశారు, ఈ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. ఇద్దరు డీఎస్పీలతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలను బందోబస్తు నిమిత్తం వినియోగించారు.

14 అంశాలతో..పిఠాపురం మేనిఫెస్టో..

పిఠాపురం, ఏప్రిల్ 2: పిఠాపురం నియోజకవర్గంలో ప్రచారం నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ రూపొందించిన కరపత్రాలను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆవిష్కరించారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో మంగళవారం రాత్రి పవన్ చేబ్రోలు బహిరంగసభలో పిఠాపురం అభివృద్ధికి ప్రకటించిన 14 అంశాల మేనిఫెస్టో, వర్మ ఇస్తున్న హామీలతో రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. ఇదే కరపత్రంలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి, 18 సంవత్సరాల్లో చేసిన సేవా కార్యక్రమాలను వర్మ పొందుపరిచారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పిఠాపురాన్ని స్వస్థలంగా చేసుకుని, ప్రతి సమస్యను నా సమస్యగా భావించి పరిష్కరించే బాధ్యతను తీసుకుంటానని తెలిపారు. బుధవారం నుంచే ఇంటింటి ప్రచారం ప్రారంభిస్తామని.. ప్రతి ఓటరుకు కరపత్రాన్ని అందిస్తామని వర్మ తెలిపారు.



ఆనంద కల్యాణం: పిఠాపురంలో నూతన జంటకు శుభాకాంక్షలు చెబుతున్న పవన్



ఇదీ నా విజన్: పిఠాపురంలో కరపత్రాలను విడుదల చేస్తున్న పవన్‌కల్యాణ్, వర్మ

తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబరు 1800-425-2532

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2: జిల్లాలో తాగునీటి సమస్యలపై నమోదవుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్‌లో టోల్‌ఫ్రీ నంబరు 1800-425-2532 ఏర్పాటు చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమైతే ప్రజలు ఆ నంబరుకు తెలియజేసి పరిష్కారం పొందవచ్చన్నారు. కాల్ సెంటరు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. కాల్ సెంటరుకు ఫోన్ చేసిన వారి మొబైల్ నంబరు, సమస్య ఉన్న ప్రాంతం వివరాలు తెలియజేస్తే సంబంధిత అధికారులు అదే రోజు లేదా మరుసటి రోజున ఫిర్యాదు ప్రాంతాన్ని సందర్శించి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు.

కోనసీమలో కాంగ్రెస్ అభ్యర్థులు వీరే... 6లో

గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని నిఘా పెంచాలి

- చెక్ పోస్టుల్లో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించాలి
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీలతో సమీక్ష

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2: గత ఎన్నికల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని నిఘా వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. గత ఎన్నికల్లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అప్పట్లో గొడవల్లో పాల్గొన్న వారిని, రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ అందరినీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయాలని ఆదేశించారు. అన్ని లైసెన్సు తుపాకులను సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తిరిగి డిపాజిట్ చేయించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో డీఎస్పీ స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయడంతో పాటు నిష్పక్షపాతంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించేందుకు అధికారులు అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని ఐజీ సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ నుంచి పోలింగ్ వరకు చేపట్టాల్సిన రోజువారీ విధులపై చెక్‌లిస్టు రూపొందించుకుని కార్యాచరణను అమలు చేయాలన్నారు. అంతర్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు, అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల్లో సిబ్బంది 24 గంటలూ వాహనాలను తనిఖీ చేస్తూ అక్రమంగా తరలించే మద్యం, నగదును సీజ్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా ట్రోలింగ్స్, తప్పుడు వార్తల వ్యాప్తికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి గొడవలు జరగకుండా నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. ఎన్నికలు శాంతియుతంగా, ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని అశోక్‌కుమార్ సూచించారు. అనంతరం ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలు బసచేసిన అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ప్రాంతానికి ఆయన చేరుకున్నారు. వారికి ఆయన పలు సూచనలు చేసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్పీలు ఎం.మహేశ్వరరావు, బి.రామకృష్ణ, కేవీ రమణ, వై.గోవిందరావు, ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు వి.శ్రీనివాస్, బి.రాజశేఖరరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడు, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ శ్రీధర్

నామినేషను ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలి: కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు నామినేషను వేసే ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు నామినేషను దాఖలు చేయడం, విధానం, వివిధ అనుమతులకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరం చేశామన్నారు. దివ్యాంగులు స్క్షమ్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారికి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, అత్యవసర సేవల ఉద్యోగుల కోసమే మొదటి వారంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ వేయడానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రతి నియోజకవర్గంలో ఇంటి నుంచి ఓటింగ్ కోసం దరఖాస్తు ఫారం-12 అందిస్తే.... 23, 24 తేదీల్లో వారి అంచనాలు రూపొందించి సూక్ష్మ పరిశీలకుల పర్యవేక్షణలో రహస్య ఓటింగ్‌కు భంగం కలగకుండా పోలింగ్ స్టేషన్ మాదిరిగా పోలింగ్ సిబ్బందితో మే10వ తేదీలోపు ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల తర్వాత నిర్ణీత గడువులోగా ఖర్చుల వివరాలను తప్పనిసరిగా అందజేయాలన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు తమ ఆస్తులతో పాటు నమోదై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలన్నారు. జాతీయ నాయకుల జయంతులను పార్టీ బ్యానర్లు, జెండాలు, కండువాలు వంటివి లేకుండా పార్టీలకు అతీంగా నిర్వహించుకోవాలన్నారు. ఎపిక్ కార్డులు ఆలస్యంగా రావడంతో ఈ నెలాఖరులోగా వాటి పంపిణీ పూర్తి చేస్తామన్నారు. లోక్‌సభ అభ్యర్థి రూ.25వేలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.10వేలు ధరావత్తుగా చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఇందులో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. కుల ధ్రువీకరణ పత్రం విధిగా జతచేయాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థులు నామినేషన్ల తుది గడువులోగా బి-ఫారం అందజేయాలన్నారు. లేదంటే వారిని స్వతంత్రులుగా పరిగణిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, యార్లగడ్డ రవీంద్ర (కాంగ్రెస్), దూరి రాజేష్ (బీజేపీ), అల్లాడ స్వామినాయుడు (టీడీపీ), సంసాని బులినాని (వైసీపీ), ప్రవీణ్ (ఆమ్‌ఆద్మీ), కేఎస్ఎల్ భవానీ (బీఎస్పీ), కారెం వెంకటేశ్వరరావు(సీపీఎం), నల్లా మల్లిబాబు పాల్గొన్నారు.

పెన్షన్లకు టెన్షనెందుకు

ఉందిగా సచివాలయ వ్యవస్థ



వైసీపీ నేతలు వలంటీర్లను తమ స్వప్రయోజనాలకు వినియోగించడంతో అందిన ఫిర్యాదుల మేరకు ఎన్నికల కమిషన్ వారిని పలు విధుల నుంచి తొలగించింది. ఈ నెల వారు పింఛన్లు ఇవ్వడానికి అవకాశం లేదు. దీంతో పింఛన్ల పంపిణీపై లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితికి పరోక్షంగా, ప్రత్యక్షంగా జగన్ ప్రభుత్వమే కారణమనడంలో సందేహం లేదు. అయితే సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించే వెసులుబాటు ఉండడంతో ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు. ఐదేళ్లుగా వలంటీర్లను ఇళ్లకు పంపించి పింఛన్లు బట్వాడా చేశారు. ఇప్పుడు ఎన్నికల సంఘం ఆదేశాలతో వాళ్లు పింఛన్లు ఇవ్వడానికి వీల్లేదు. దీంతో సచివాలయ సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు.

- ఇంటింటికీ పింఛను పంపిణీ సులువే
- జిల్లాల్లో భారీ సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు
- వారు తలుచుకుంటే నాలుగైదు రోజుల్లో పని పూర్తి
- అధికారులు ఆదేశాలివ్వడమే తరువాయి
- 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ!
- నేడు పింఛన్ల పంపిణీ డౌటే..
- బ్యాంకులకు చేరని డబ్బు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి, బిక్కవోలు, చాగల్లు, దేవరపల్లి, గోకవరం, గోపాలపురం, కడియం, కోరుకొండ, కొవ్వూరు అర్బన్, రూరల్, నల్లజర్ల, నిడదవోలు అర్బన్, రూరల్, పెరవలి, రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం, రంగంపేట, సీతానగరం, తాళ్లపూడి, ఉండ్రాజవరం మండలాల్లో అభయహస్తం 5809, అమరావతి ల్యాండ్‌లెస్ పూర్ 3, సీకేడీయూ ప్రభుత్వ 186, ప్రైవేటు 261, డప్పు కళాకారులు 749, దివ్యాంగ 33194, డీఎంహెచ్‌వో సంబంధిత 1831, ఫిషర్‌మెన్ 1932, ఓఏపీ 121658, కళాకారులకు 154, సైనిక సంక్షేమ 18, ఒంటరి మహిళ 9149, కల్లుగీత కార్మికులు 2488, చర్మకారులు 858, ట్రాన్స్‌జెండర్లు 61, నేతకారులు 1338, వితంతు 65041 కలిపి మొత్తం 2,44,730 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాలోని 512 సచివాలయాల్లో 4944 మంది ఉద్యోగులు ఉన్నారు. మొత్తం పింఛన్లను సచివాలయ సిబ్బందికి విభజిస్తే ఒక్కొక్కరు రోజుకు సరాసరి 80 పింఛన్లు పంపిణీ చేయాల్సి వస్తుంది. ఈ నెల 3(నేడు) నుంచి 8వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆరు రోజుల్లో 3వ తేదీన బ్యాంకుల నుంచి సచివాలయ సిబ్బంది డబ్బులు డ్రా చేయడం, ట్యాబ్‌లలో యాప్ తదితర ప్రక్రియ చూసుకున్నా.. 4 నుంచి 8 వరకూ ఐదు రోజుల్లో పింఛన్లు బట్వాడా చేయాల్సి ఉంటుంది. రోజుకు ఒక్కొక్కరు సరాసరి 20 పంపిణీ చేసినా ఐదు రోజుల్లో పూర్తవుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు లేకపోయినా పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు.

వలంటీర్లను వంచించి..

దేశంలో ఎక్కడా లేని విధంగా స్వలబ్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం యువత జీవితాలతో ఆటలాడుకొంది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. వలంటీరు వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చింది. ఎప్పటికైనా జీవితాలు బాగుంటాయనే ఉద్దేశంతో పీజీలు చదివిన వాళ్లు కూడా నెలకు కేవలం రూ.5 వేలు ఇచ్చే ఉద్యోగానికి తలొగ్గక తప్పలేదు. తీరా ఉద్యోగంలో చేరిన తర్వాత స్పష్టమైన విధులు(జాబ్ చార్టు) లేకుండా ఇష్టానుసారం ఊడిగం చేయించుకున్నారు. చివరికి వైసీపీ సభలకు జనాలను తరలించే బాధ్యత కూడా వారికే అప్పజెప్పారు. వలంటీరు అంటే సేవకులని, వారిది ఉద్యోగం కాదని చాలా సందర్భాల్లో వైసీపీ నాయకులు చెప్పుకొచ్చారు. జగన్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అయితే ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ తమ సైన్యమంటూ జగన్ ఊదరగొట్టారు. చివరికి ఎన్నికల సంఘం ఆదేశాలతో వారిని పింఛన్ల పంపిణీకి సైతం పక్కన పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ముందు నుంచీ అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారుల నుంచి ఒత్తిడి భరిస్తూ ఉద్యోగాలను(సేవ)ను నెట్టుకొచ్చారు. కానీ అడుగడుగునా అవమానాలే ఎదురయ్యాయి. వెనుదిరిగి చూస్తే వలంటీరు పేరుతో యువత చేసిన ఊడిగం తప్ప.. వారికి జరిగిన మేలు మాత్రం కానరాని పరిస్థితి ఉంది. ఇప్పటికీ వాళ్లను ఏదో విధంగా మాటలతో మభ్యపెడుతుండడం గమనార్హం.



జిల్లాలోని 2.44 లక్షల మంది లబ్ధిదారుల్లో సుమారు 5 వేల మందికి ఇంటికి వెళ్లి అందజేయాల్సిన పరిస్థితి ఉంది. మిగతా వారికి ఖాతాల్లో నేరుగా రైతుబంధు మాదిరిగా పింఛను సొమ్ము జమచేసినా

నేరుగా డబ్బులు జమ చేస్తే..

ఇబ్బందులను అధిగమించవచ్చు. కానీ జగన్ ప్రభుత్వం స్వీయ లబ్ధి కోసం వలంటీరు వ్యవస్థను సృష్టించి ఇంటికి పింఛను పంపిణీ మాటున వైసీపీ పార్టీ ప్రచారం చేయించుకొంది. నెలకు కేవలం రూ.5 వేలు చేతిలో పెట్టి ఐదేళ్ల పాటు వారి జీవితాలతో ఆడుకొంది. తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేసినా అధికార దండంతో నిరసన గళాన్ని నొక్కేసింది. గత ప్రభుత్వంలో ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత కూడా పింఛను పంపిణీ సాఫీగా సాగేది. ఎప్పటి మాదిరిగానే ఆయా వార్డులకు, గ్రామాలకు కేటాయించిన ఉద్యోగులు వెళ్లి పింఛను అందజేసేవారు. ఈ విధానానికి టీడీపీ ఎలాంటి స్వీయ లబ్ధిని ఆపాదించని కారణంగా ఇబ్బందులు ఉండేవికావు. గతంలో ఎన్నడూ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత కూడా ఇప్పటి మాదిరిగా సమస్య ఉత్పన్నం కాలేదు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం వలంటీరు పేరుతో యువతకు భద్రమైన ఉద్యోగం లేకుండా చేసింది. ప్రస్తుతం వారి విషయంలో జరుగుతున్న పరిణామాలు ఇదే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

నేడు పింఛన్లు డౌటే

రాజమహేంద్రవరం,ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి) : పింఛన్‌దార్లతో వైసీపీ ప్రభుత్వం ఆడుకుంటోంది. వలంటీర్లను దూరం పెట్టడంవల్ల ఇబ్బంది కలిగిందని చెబుతున్న ప్రభుత్వం మంగళవారం కూడా జిల్లాలకు పింఛన్ల సొమ్ము పంపలేదు. బుధవారం జమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ బుధవారం డబ్బు వచ్చినా బ్యాంక్‌లు 10 గంటలకు తెరచి లావాదేవీలు ఆరంభించేసరికి కనీసం 11 గంటలు అవుతుంది. వాటిని అన్ని సచివాలయాలకు చెందిన నిర్దేశిత ఉద్యోగులు వెళ్లి డ్రా చేసుకుని రావాలి. ప్రతి ఊరిలోనూ బ్యాంకులు ఉండవు. ఈ నేపథ్యంలో బ్యాంకుల్లో డబ్బు జమ అయినా, డ్రా చేయడానికి సమయం పడుతుంది. దీంతో బుధవారం కూడా పింఛన్లు పంపిణీ చేసే అవకాశాలు తక్కువ.

6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ: కలెక్టర్

ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత తెలిపారు. మంగళవారం జిల్లా డివిజన్ మండల స్థాయి అధికారులు, బ్యాంకర్లతో ఆమె తన చాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదట 8వ తేదీ వరకూ పంపిణీ అని చెప్పారు. దీనిని 6వ తేదీకి కుదించారు. విభిన్న దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, మంచం పట్టిన వారు, వీల్ చైర్లకు పరిమితమైన వారు, యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు బుధవారం ఉదయం 11 గంటల నుంచే ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన వారికి గ్రామ, వార్డు సచివాలయాలలో పంపిణీ చేస్తారన్నారు. 6వ తేదీ వరకూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ విధుల్లో ఉండాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని టెన్త్ విద్యార్థి దుర్మరణం



కరప, ఏప్రిల్ 2: కరప మండలం పెదకొత్తూరు ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొని పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామానికి చెందిన బుంగా తనీష్ (15) కరప మండలం వేములవాడలో ఉంటున్న స్నేహితుడిని కలిసేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. పెదకొత్తూరు జానకీరామ రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన తనీష్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తనీష్ తండ్రి బుంగా రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బుల్లెట్‌కు నిప్పుపెట్టిన దుండగులు



కరప, ఏప్రిల్ 2: మండల కేంద్రం కరపలో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు దుండగులు బుల్లెట్‌కు నిప్పు పెట్టి పరారయ్యారు. కరప పోలీసులు, బాధితుడు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరపకు చెందిన సానా వీరబాబు బిర్యానీ పాయింట్ పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాడు. సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని హైస్కూల్ ఎదురుగా తాను ఉంటున్న ఇంటి సందులో బుల్లెట్ పెట్టి లోపలికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి బుల్లెట్ కాలిపోయిన స్థితిలో కనిపించింది. దీనిపై కరప పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు పక్కనే ఉన్న పువ్వుల దుకాణంలోకి వెళ్లి సందులో ఉన్న బండిని పెట్రోల్ పోసి అంటించినట్టు కనిపించింది. తనకు ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉందని, వారే కక్షపూరితంగా ఈ పని చేసి ఉండవచ్చని బాధితుడు పోలీసులకు తెలిపాడు. గత ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి ఇంటి సందు బయట పెట్టిన బుల్లెట్ బండిని అపహరించుకుపోయారని, దీనిపై అప్పట్లోనే కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు. రెండు వారాల క్రితం రూ.1.40 లక్షలతో మరో బుల్లెట్ బండిని కొనుగోలు చేయగా దుండగులు పెట్రోల్ పోసి తగలబెట్టారని బాధితుడు వీరబాబు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఏఎస్‌ఐ సూరిబాబు తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు వీరే..



మారోతి గణేశ్వరరావు (జగ్గంపేట)



ఎన్‌వీవీ సత్యనారాయణ (ప్రత్తిపాడు)

కాకినాడ పార్లమెంట్ పరిధిలో..

కాకినాడ సిటీ, ఏప్రిల్ 2 : రానున్న ఎన్నికలలో కాకినాడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులను కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) ప్రకటించింది. తుని అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గేలం శ్రీనివాసరావు, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా డీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్‌వీవీ సత్యనారాయణ, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా బ్లాక్-టు ప్రెసిడెంట్ మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పిల్లి సత్య లక్ష్మి, పెద్దాపురం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పీసీసీ మెంబర్ తుమ్మల దొరబాబు, కాకినాడ సిటీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యరిగా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చెక్క నూకరాజు, జగ్గంపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పీసీసీ అధికార ప్రతినిధి మారోతి వీవీ గణేశ్వరరావును ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు మాట్లాడుతూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ప్రకటించిన అభ్యర్థుల జాబితాను స్వాగ తిస్తున్నామన్నారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు సారథ్యంలో పార్టీ విజయానికి జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఎవరని చూడకుండా పార్టీ గుర్తు హస్తాన్ని చూసి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టో పథకాలను వివరించాలన్నారు. జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైసీపీ, టీడీపీ కూటమికి దీటుగా జిల్లాలో విస్తృత ప్రచారం చేపట్టాలని పాండురంగారావు పిలుపునిచ్చారు.

రాజమహేంద్రవరం పరిధిలో..



బోడా వెంకట్



బాలేపల్లి మురళీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 2: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ఖరారు చేశారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ రాష్ట్ర వ్యాప్తంగా 114 మంది అభ్యర్థుల పేర్లు మంగళవారం ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం సిటీ నుంచి బోడా వెంకట్, రూరల్ నుంచి బాలేపల్లి మురళీధర్, అనపర్తి నుంచి డాక్టర్ యల్లా శ్రీనివాసరావు, రాజానగరం నుంచి ముండ్రు వెంకట శ్రీనివాస్, కొవ్వూరు నుంచి అరిగెల అరుణకుమారి, నిడదవోలు నుంచి పెద్దిరెడ్డి సుబ్బారావు పేర్లను ఏఐసీసీ ప్రకటించింది.

అమలాపురం పార్లమెంట్ పరిధిలో..



అయితాబత్తుల సుభాషిణి



సరెళ్ల ప్రసన్నకుమార్



కామన ప్రభాకరరావు

అమలాపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ఇడుపులపాయలో మంగళవారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విడుదల చేశారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిత్వం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న కామన ప్రభాకరరావుకు దక్కింది. రామచంద్రపురం నుంచి కోట శ్రీనివాసరావు, ముమ్మిడివరం నుంచి పాలెపు ధర్మారావు, కొత్తపేట నుంచి రౌతు ఈశ్వరరావు, రాజోలు నుంచి సరెళ్ల ప్రసన్నకుమార్, అమలాపురం నియోజకవర్గం నుంచి అయితాబత్తుల సుభాషిణిలను ఖరారు చేశారు. అమలాపురం లోక్‌సభ, పి.గన్నవరం అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాలి..



పాలెపు ధర్మారావు



రౌతు ఈశ్వరరావు



కోట శ్రీనివాసరావు

ధ్వజస్తంభం నుంచి వెండి తొలగింపు పనులు ప్రారంభం



అధికారుల సమక్షంలో వెండిని తూకం వేస్తున్న దృశ్యం

అన్నవరం, ఏప్రిల్ 2: కోరిన కోర్కెలు తీర్చే కలియుగదైవం సత్యదేవుడి సన్నిధి స్వర్ణమయం కావడానికి అడుగులు వడివడిగా పడుతున్నాయి. ముందుగా స్వామివారి ధ్వజస్తంభానికి దాత సహాయంతో బంగారు తాపడం చేస్తున్న సంగతి విదితమే. దీనిలో భాగంగా శిథిలావస్థకు చేరిన వెండి ధ్వజ స్తంభం నుంచి వెండి ఒలిచే కార్యక్రమం మంగళవారం ఈవో రామచంద్రమోహన్, దేవదాయ శాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి భవాని పర్యవేక్షణలో కమిటీ సభ్యులు డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, ఏఈవో ఎల్.శ్రీనివాస్, సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్ చేపట్టారు. నెల్లూరుకు చెందిన దాత సుమారు రూ.4 కోట్ల వ్యయంతో 64 అడుగుల నార వేప కర్రపై రాగిరేకుపై బంగారు తాపడం చేయించనున్నారు. దీనికి సంబంధించి ఈనెల 18 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి 22వ తేదీన బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠించనున్నారు. అత్యంత వేడుకగా ఈ కార్యక్రమాలు జరపాలని ఈవో రామచంద్రమోహన్ నిర్ణయించారు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు వెండి ఒలిచే కార్యక్రమం కొనసాగించారు. దీనిని దేవదాయ కమిషనర్ అనుమతితో మింట్‌కు తరలించి వెండి కడ్డీలుగా మార్చాలని ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే దేవస్థానంలో సుమారు 1100 కేజీల వెండిని కడ్డీలుగా మార్చి భద్రపరిచారు. ఆలయ గోపురం స్వర్ణమయం చేసేందుకు అనుమతులు అతి త్వరలోనే రానున్నాయి. దీనికి సంబంధించి సోమవారం రత్నగిరికి విచ్చేసిన దేవదాయ కమిషనర్ సత్యనారాయణ సానుకూలత వ్యక్తం చేశారు. ఇప్పటికే దేవదాయ శాఖ స్థపతి ఆలయ గోపురాన్ని పరిశీలించి సుమారు 11.500 కేజీల బంగారం పడుతుందని ప్రాథమికంగా అంచనా వేయగా సుమారు రూ.7కోట్లు వ్యయం అవుతుందన్నారు. దేవదాయ కమిషనర్ అనుమతులు వచ్చిన వెంటనే దాతల సహకారంతో గోపురం స్వర్ణమయం పనులు ప్రారంభించనున్నారు.

కలెక్టర్‌ను కలిసిన అన్నవరం ఈవో



కలెక్టర్ నివాస్‌కు ప్రసాదం అందిస్తున్న ఈవో

కాకినాడ కలెక్టరేట్/ అన్నవరం, ఏప్రిల్ 2: కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నివాస్‌ను అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈనెల 22న జరిగే బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనకు ఆయనను ఆహ్వానించారు. వచ్చే నెల 18 నుంచి 24 వరకు సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాలు, 19న స్వామివారి దివ్య కల్యాణం జరగనుందని వివరించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం దేవస్థానం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. పీఆర్వో కృష్ణారావు, డిప్యూటీ ఇంజనీర్ రాంబాబు, బీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

అవయవదానం



రాజు

మండపేట, ఏప్రిల్ 2: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాక గ్రామానికి చెందిన కౌలు రైతు కాదా రాజు(38) మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. రాజు మార్చి 28న సైకిల్‌పై నుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యుల సూచనతో రాజమహేంద్రవరం అక్కడ నుంచి విశాఖపట్నంలో ఉన్న కిమ్స్ ఆసుపత్రికి రాజును తరలించారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు రాజుకు తలకు తగిలిన బలమైన గాయం వల్ల బ్రెయిన్ డెడ్ అయిందని ధ్రువీకరించారు. అతను బతకడం కష్టమని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో రాజు శరీరంలో అవయవాలను కుటుంబసభ్యులు ఆస్పత్రిలో ఉన్న అవయవదాన్ ట్రస్టుకు మంగళవారం దానం చేశారు. రాజుకు భార్య మణి, కుమార్తె భార్గవ్ ప్రవీణ, కుమారుడు అవినాష్ ఉన్నారు. మరణానంతరం రాజు పది మందికి తన అవయవాలను దానం చేసి జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు. రాజు మృతదేహాన్ని స్వగ్రామం మారేడుబాకకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, ఏప్రిల్ 2: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒకదాత రూ 1,01,116 విరాళంగా సమర్పించారు. విశాఖపట్నానికి చెందిన వై.సాయి జగన్నాథ్ ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

11న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఈ నెల 11న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత మంగళవారం తెలిపారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించనున్నట్టు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్, ఏప్రిల్2: తుని రైల్వేస్టేషన్‌లో 1వ నెంబరు ప్లాట్‌ఫాం మొదలు కొండవారిపేట తూము దగ్గరలో పట్టాలు దాటే క్రమంలో అన్నవరం వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో 30 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరంపై టీ షర్ట్, మిలట్రీ గ్రీన్ జీన్ ఫ్యాంట్ ఉంది. చేతిపై ఓం అనే పచ్చబొట్టు ఉంది. బంధువులు గుర్తిస్తే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు.

యాజమాన్యం నిర్లక్ష్యం

ప్రాణాపాయ స్థితిలో గురుకుల పాఠశాల విద్యార్థి

కరప, ఏప్రిల్ 2: గురుకుల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఒక విద్యార్థి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రం కరపలో మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల లో యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన పెర్ల జాన్‌బాబు 9వ తరగతి చదువుతున్నాడు. గత మార్చి 30వ తేదీన పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటూ ఉండగా అనుకోకుండా రెండు అంగుళాల ఇనుప ముక్కను మింగేశాడు. జాన్‌బాబు కడుపులోకి వెళ్లిన ఆ ఇనుప ముక్క క్రమేపి పెద్దపేగులోకి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంత జరిగినా పాఠశాల ప్రిన్సిపాల్ గోప్యత పాటించి సదరు విద్యార్థిని ఆసుపత్రిలో చేర్చి మంగళవారం ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి కోలుకుంటు న్నట్లుగా తెలిసింది. అయితే జరిగిన ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పెర్ల తాతారావు, సత్యవేణిలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన నాలుగు రోజులైనా ప్రిన్సిపాల్ తమకు తెలపకుండా గోప్యత పాటించడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణం విచారణ జరిపి సదరు ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత తల్లిదండ్రులు కోరుతున్నారు.

బెల్టు షాపులపై దాడి

ఒకరిపై కేసు నమోదు

వై.రామవరం,ఏప్రిల్ 2: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో మద్యం బెల్టు షాపులపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) కొరడా ఝుళిపించింది. ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో బెల్టుపై బేఖాతర్ శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు చవిటిదిబ్బలు ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి తరలిస్తున్న అక్రమ మద్యం సీసాలపై నిఘా పెట్టారు. పలు బెల్టుషాపులపై దాడులు జరిపి మంగళవారం ఒకరిపై కేసు నమోదు చేశారు. రంపచోడవరం ఎస్ఈబీ సీఐ ఎన్.ఇంద్రజిత్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు(పాడేరు) ఆదేశాలతో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.నాగరాహుల్ ఆధ్వర్యంలో ఎస్ఐ అబ్దుల్ అలీతో కలిసి దాడులు జరిపామన్నారు. మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

తుఫాన్ నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలి

మామిడికుదురు, ఏప్రిల్ 2: మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సభ్యులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దాళ్వాలో పెట్టుబడులు పెట్టి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో రైతులు తాటికాయల ఉదయభాస్కరరావు, అప్పారి వెంకటేశ్వరరావు, రాయుడు ఆనందరావు, పెచ్చెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ ప్రజల రుణం తీర్చుకుంటా





రాజోలు: మాట్లాడుతున్న హరీష్‌మాధుర్, పి.గన్నవరం జయహో బీసీ సభలో గిడ్డి సత్యనారాయణ, టీడీపీ, జనసేన శ్రేణులు, ఉప్పలగుప్తం: మాట్లాడుతున్న మత్స్యకార సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు భీమరాజు

పార్లమెంటరీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్

రాజోలు, ఏప్రిల్ 2: కోనసీమ ప్రజల రుణం తీర్చుకుంటానని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అన్నారు. మంగళవారం శివకోటిలో మంగెన గంగయ్య కాపు కల్యాణ మండపంలో రాజోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హరీష్, రాజోలు నియోజకవర్గ అభ్యర్థి దేవ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా హరీష్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు సమన్వయంతో పనిచేస్తే గెలుపు తథ్యమన్నారు. కోనసీమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రైలు కూతను త్వరలోనే తీసుకువస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ దుర్మార్గపు ప్రభుత్వాన్ని ప్రజలంతా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజోలు అసెంబ్లీ అభ్యర్థి దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ గ్రామం నుంచి ప్రతీ పార్టీ నుంచి 15మంది సభ్యుల కోఆర్డినేషన్‌తో ముందుకు వెళతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, గుండుబోగుల పెదకాపు, మంగెన భూదేవి, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సర్పంచ్ చెల్లుబోయిన హెలీన, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, బందెల పద్మ, పినిశెట్టి బుజ్జి, రాపాక నవరత్నం, గుండాబత్తుల తాతాజీ, మానేపల్లి బాలాజీవేమా, బోళ్ల రాజేష్, చెల్లుబోయిన శ్రీనివాస్, బోళ్ల వెంకటరమణ, అడబాల విజయ్, రావి మురళీ, కసుకుర్తి త్రినాథస్వామి, గాలిదేవర వెంకన్నబాబు, కడలి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం జరిగింది

పి.గన్నవరం, ఏప్రిల్ 2: టీడీపీ హయాంలోనే బీసీలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని ఎన్‌డీఏ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం శివారు పితానివారిపాలెంలో సంసాని పెద్దిరాజు అధ్యక్షత జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలయికతో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. టీడీపీ, జనసేన నాయకులు రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యుడు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, బొంతు పెదబాబు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మట్టపర్తి రామకృష్ణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, చొల్లంగి సత్తిబాబు, శేరు శ్రీనుబాబు, పితాని రాంబాబు, గుత్తుల రామకృష్ణ, కుడిపూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీతోనే బీసీలకు గుర్తింపు'

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 2: బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు ఇచ్చిన పార్టీ టీడీపీయేనని ఆ పార్టీ పార్టీ మత్స్యకార సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు లంకే భీమరాజు అన్నారు. భీమనపల్లిలో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన క్లస్టర్-9 చైర్మన్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తులఆనందరావు హాజరయ్యారు.బీసీసెల్ నియోజకవర్గ చైర్మన్ గుత్తుల నాగేశ్వరరావు, మండల చైర్మన్ గుత్తుల శ్రీనివాస్, చప్పిడి వెంకటనాగేశ్వరరావు, యరగర్ల వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరావు (కిరణ్), కడలి శ్రీనివాసరావు, శీలం భాస్కరరావు, మల్లాడి వెంకటరమణ, బొంతు రామ్మోహనరావు, పిచ్చిక వీరభద్రరావు, దొడ్డిపట్ల దుర్గారావు, అయినాపురపు అప్పారావు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు అనుమతులు చూపించగలరా

కొత్తపేట, ఏప్రిల్2: కొత్తపేట నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లకు అనుమతులను బహిరంగంగా చూపించే దమ్ము స్థానిక ప్రజాప్రతినిధికి ఉందా అని ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు ప్రశ్నించారు. ఇసుక ర్యాంపులో కార్మికులు చేయాల్సిన పనిని ఎక్స్‌కవేర్లతో చేయించి కార్మికులకు గురించి మాట్లాడతారా అన్నారు. అక్రమంగా ఇసుకను తవ్వడమేకాక తవ్వకాలను టీడీపీ అడ్డుకుంటోందని ఆరోపించడం వైసీపీ నేతల దుర్మార్గపు చర్యలకు నిదర్శనమన్నారు. టీడీపీ నాయకులు కేవీ సత్యనారాయణరెడ్డి, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరరావు, ఈదల సత్తిబాబు, వాసంశెట్టి సత్యనారాయణ, ప్రసన్న, ఆనంద్, జనసైనికులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ వర్ధంతి

అమలాపురం రూరల్, ఏప్రిల్2: ఢిల్లీ సుల్తాన్‌లను తరిమికొట్టిన తొలి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని కోనసీమ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కామనగరువులోని సంఘ కార్యాలయంలో గౌడ్ చిత్రపటానికి సంఘ అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు రాజులపూడి సత్యనారాయణ, రాజులపూడి మహేశ్వరరావు, కామన రాజు, దాసరి గోవిందరావు, మట్ట బుజ్జి, దాసరి సాయిబాబు, రాజులపూడి వెంకన్న, నిచ్చెనకోళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 2: స్థానిక మండలపరిషత్ కార్యాలయం మంగళవారం రబీ ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామరెవెన్యూ అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులు, ధాన్యంకొనుగోలు సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు. ఏవో రమేష్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యం నాణ్యత చూసిన అనంతరం కూపన్ జారీచేసి ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తామన్నారు. ఎక్కువ ధర వస్తే ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్లో కూడా అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ. కొండలరావు, మండలంలోని క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి సుభాష్‌కు పూర్తి మద్దతు: రేవు శ్రీను

కె.గంగవరం, ఏప్రిల్ 2: టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్‌కు మద్దతు ఇస్తున్నట్టు టీడీపీసీనియర్ నాయకుడు పప్పుల మసేను వెంకన్న(రేవుశ్రీను) అన్నారు.మంగళవారం కోటిపల్లిలో రేవు శ్రీను తన అనుచరులతో నిర్వహించిన సమావేశానికి సుభాష్ హాజరయ్యారు. ఈసందర్భంగా రేవు శ్రీను మాట్లాడుతూ పార్టీ భరోసా ఇచ్చిందని ఎవరూ ఆందోళన చెందవద్దని అనుచరులకు వివరించారు. అనంతరం సుభాష్ మాట్లాడుతూ పార్టీ అయనకు సముచిత స్థానం ఇస్తుందన్నారు. ఆయన, అనుచరులందరూ తన విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ పొలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మేడిశెట్టి రవికుమార్, సలాది శ్రీను, పామర్తి బాబులు, పేకేరు బాబ్జీ, చంద్రు వీర్రాజు చౌదరి, నేమాని అబ్బు, అల్లూరి దొరబాబు, గన్ని శ్రీను, మరివాడ చిన్నికృష్ణ, గతంలో తోట త్రిమూర్తులు వెంట నడిచిన క్యాడర్‌లో ప్రముఖులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలి



ఎంపీడీవో లక్ష్మీరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అమలాపురంరూరల్, ఏప్రిల్2: ఎన్నికల కమిషన్ ఆదేశాలతో వలంటీరు వ్యవస్థను పక్కన పెట్టినందున సచివాలయ ఉద్యోగులతో ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు చేపట్టాలని తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి అధికారి జయవెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో లక్ష్మీరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు, నాయకులు ఈతకోట నాగేశ్వరరావు, చొల్లంగి సత్యసాయిబాబా,మంద గెద్దయ్య, అధికారి బాబ్జీ, గోడి సత్తిబాబు, మల్లాడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: పింఛన్లుసచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు సూచించారు. మంగళవారం ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణికి వినతిపత్రాన్ని అందించారు. మండల టీడీపీ అధ్యక్షులు తోలేటి సత్తిబాబు, యంట్ర శ్రీనివాసరావు, శేరు త్రిమూర్తులు, లంకే చిరంజీవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి పెన్షన్లు పంపిణీ చేయాలని సీపీఎం, సీపీఐ పార్టీలు కోరాయి. సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లను సకాలంలో అందించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రాజోలు: పింఛన్లు సచివాలయ సిబ్బందితో ఇంటి వద్ద ఇవ్వాలని టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీవో ఎస్.బాలాజీకి వినతిపత్రం అందజేశారు. పింఛన్ లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతీ ఇంటికీ అందించాలని ఎంపీపీ కేతా శ్రీను, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ డిమాండు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, టీడీపీ రాజోలు మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, రాపాక నవరత్నం, కడలి మోహన్, చిట్టూరి సంతోష్ పాల్గొన్నారు. పింఛన్లు ఇంటింటికీ అందించాలని టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, పార్లమెంటు అధికార ప్రతినిధి బందెల పద్మ, విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హెలీన డిమాండు చేశారు.వైసీపీ కావాలనే పింఛన్ల పంపిణీ తాత్సారం చేస్తుందన్నారు.

అయినవిల్లి: ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని చేస్తున్న దుష్ప్రచారాన్నిమాని తక్షణం సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యపురాజు వెంకటసత్యనారాయణరాజు, సలాది పుల్లయ్యనాయుడు, కళ్లేపల్లి సుబ్బరాజు, పెంట్ర రమేష్, కుడుపూడి దుర్గారావు, బిక్కిన బాబి, మద్దాల రాజా, గుమ్మడి వెంకటేశ్వరరావు, గెల్లా అశోక్ పాల్గొన్నారు. రూ.13వేల కోట్ల నిధులను ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచి పెట్టారని టీడీపీ హైఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు ఆరోపించారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేద్దాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి



ఉప్పలగుప్తంలో ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి ఆనందరావు

అంబాజీపేట, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. స్థానిక వెంకట్రాజు ఆయిల్‌మిల్లు వద్ద నిర్వహించిన నియోజకవర్గ ఉమ్మడి పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రావులపాలెం, రామచంద్రపురంలో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభలకు అధికసంఖ్యలో ఉమ్మడి పార్టీశ్రేణులు తరలిరావాలని కోరారు. పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి శ్రేణులంతా తన గెలుపునకు కృషిచేయాలని కోరారు. నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, జనసేన జిల్లాఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, పి.గన్నవరం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, దొమ్మేటి సాయికృష్ణ, మైపాల తాతాజీ, మద్దాల సుబ్బారావు, మద్దా చంటిబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, గుడాల ఫణి, చిన్నం బాలవిజయరావు, పెనుమాల లక్ష్మి, అడ్డగళ్ళ శిరిజ్యోతి, అరిగెల సూరిబాబు, వక్కలంక బుల్లియ్య పాల్గొన్నారు.

ఆనందరావు ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం, ఏప్రిల్2: ఉప్పలగుప్తం,పేరాయిచెరువు, ఆదిలక్ష్మీపురంల్లో మంగళవారం జనసేన ముఖ్యనాయకులు, కార్యకర్తలు, టీడీపీ శ్రేణులతో కలిసి అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావును ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో గ్రామకమిటీ అధ్యక్షుడు చిక్కం కాసు అధ్యక్షతన జనసేన నాయకుడు చిక్కం సూర్యమోహన్ ఇంటి నుంచి ఆనందరావు ప్రచారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నల్లా బాబండి, నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, చిక్కం ఉమేష్, రవణం మధు, గుత్తుల నాగేశ్వరరావు, పెయ్యల దుర్గారావు, గొలకోటి చిన్నా, ఆకేటి పెద్ద, జనసేనకు చెందిన ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, చిక్కం సుధ, మహదశ నాగేశ్వరరావు, మారిశెట్టి రమేష్, చిక్కం భీముడు, ఆకేటి వెంకటేష్, బీజేపీ నాయకుడు గనిశెట్టి అరవింద్, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారం

కాట్రేనికోన, ఏప్రిల్ 2: పల్లంకుర్రు పంచాయతీ రామాలయంపేటలో మంగళవారం టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.అసెంబ్లీఅభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, అమలాపురం పార్లమెంటు అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, జనిపల్లి సోమన్న, ఇసుకపట్ల రాంబాబు, జొన్నాడ రాజారావు, రేవు రమేష్, గెద్దాడ శ్రీను, వెంట్రు సుధీర్, కాశి నరేష్, ఇసుకపట్ల రమణ, గోడి వెంకట్రావు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి: బుచ్చిబాబు



ముమ్మిడివరం: అరటిపండ్ల వ్యాపారులతో దాట్ల బుచ్చిబాబు



కాట్రేనికోన: దాట్ల సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 2: అభివృద్ధి, సంక్షేమం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ద్వారానే సాధ్యమవుతుందని కూటమి ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. మంగళవారం సీహెచ్ గున్నేపల్లి లంకాఫ్‌ఠాణేలంక, గురజాపులంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో మహిళలు, ప్రజలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని గుర్తిచేసి మళ్లీ ఈఎన్నికల్లో తమనే గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో తాపీ పనిచేస్తున్న కార్మికులను, వెల్డింగ్ వర్కు, పండ్ల వ్యాపారులను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకుని ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, తాడి నరసింహారావు, దాట్ల పృథ్వీరాజ్, దొమ్మేటి రమణకుమార్, పొత్తూరి విజయభాస్కరవర్మ, సాగిరాజు సూరిబాబురాజు, చిక్కాల అంజిబాబు, నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, యాళ్ల ఉదయ్, మిమ్మితి చిరంజీవి, దంగేటి శ్రీనివాస్, శీలం సత్యనారాయణ, దూడల స్వామి, రంబాల రమేష్, ముత్యాల జయలక్ష్మి, దున్నాల నాగమణి, బొక్కా రుక్మిణి, కుంచనపల్లి నారాయణ, గొలకోటి వెంకటరెడ్డి, గొలకోటి సాయిబాబు, గొలకోటి భాస్కరమూర్తి, గొలకోటి తాతాజీ, చవటపల్లి నాగు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

కాట్రేనికోన, ఏప్రిల్2: చెయ్యేరుకు చెందిన 100మంది వైసీపీ నాయకులు,కార్యకర్తలు మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో వడ్డి శ్రీనివాసరావు, కుమ్మరి శ్రీనివాసరావు, జనిపెల్ల శ్రీను, ముడిదుడ్డి ప్రకాశరావు, మట్టపర్తి శివ, కావూరి సాయిబాబు, మాకే నాగరాజు, జల్లి రాజశేఖర్, కఠారి ప్రదీప్, చరణ్, ప్రవీణ్,మొల్లేటి లక్ష్మణ్, ముడిదుడ్డి ఏసు, గుత్తుల సత్యనారాయణ, సఖిల రాంబాబు, గుత్తుల దుర్గారావు, కూరాటి నాగరాజు, వడ్డి సత్తిబాబు,వడ్డి నారాయణరావు, వడ్డి సత్యనారాయణ, కొంకి సుబ్బన్న, వడ్డి ఆనందరావు, ముడిదుడ్డి ప్రకాశరావు, పచ్చిమాల పుల్లయ్య, పందిరి వీరవెంకటసత్యనారాయణ, గుత్తాల పుల్లయ్య, గుత్తాల శ్రీను, గంటి ప్రసాద్, గంటి నరేంద్ర, పండు కృష్ణ, పండు అచ్చిబాబు, పండు శ్రీను, గంటి లక్ష్మణ్, గుంట్రు సుదర్శన్‌బాబు, గుంట్రు సన్నిబాబు, పండు రామకృష్ణ, కట్టా నాగేశ్వరరావు, ముషిణి శ్రీనివాసరావు, కఠారి సూర్యనారాయణ, కొల్లి వెంకటేశ్వరావు, సవరపు రాజు, జొన్నాడ వెంకటేశ్వర్లు, రాయి అనీల్, తొత్తరమూడి సంతోష్, బొక్కా సత్తిబాబు, మట్టపర్తి సత్యనారాయణ, బడుగు వెంకటేష్, గుదే శ్రీనివాసరావు, దర్శిపాటి రాజశేఖర్ తదితరులున్నారు.

ఓటు హక్కును నూరుశాతం వినియోగించుకోవాలి

అమలాపురంటౌన్, ఏప్రిల్2: ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ హక్కులకై ప్రభుత్వాలను ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 'స్వీప్'లో భాగంగా మంగళవారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో సమగ్ర శిక్షా సిబ్బంది, డ్వాక్రా, మెప్మా సభ్యులు భారతదేశ చిత్రపటాన్ని రూపొందించి ఓటు హక్కు వినియోగం, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మే13నజరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్‌ఆధ్వర్యంలో మానవహారం నిర్మించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎ.మధుసూదనరావు, ఏపీడీ ఎంఎం జిలానీ, సమగ్ర శిక్షా ఏఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఎంఎకే భీమారావు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి సహకరించేవారికే మద్దతు

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 2: క్రైస్తవుల అభ్యున్నతికి సహకరించేవారికే ఎన్నికల్లో మద్దతు ఇస్తామని నియోజకవర్గ క్రైస్తవ నాయకుల ఐక్య సమావేశం తెలిపింది. మంగళవారం రామచంద్రపురంలో నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. మేజర్ పంచాయతీల్లో సమాధుల తోట నిర్మాణం చేయాలని, 3మండల కేంద్రాల్లో ఫంక్షన్ హాల్స్ నిర్మాణం చేయాలని తీర్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.పి.జాషువా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు డా. డేనియల్ పాల్, ఉపాధ్యక్షులు ఆర్.పి.జాషువా, వి.జాన్ బెన్ని, టి.భూషణం, వై.బెన్నిబాబు, కె.సమర్పణరావు, పాస్టర్లు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో శశికళకు రజత పతకం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 2: ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఉందుర్తి శశికళ విజయవాడలో జరిగిన అండర్-17 పవర్ లిఫ్టింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. శశికళను డీఈవో ఎం.కమలకుమారి, డీవైఈవో లక్ష్మీనరసింహ, పీఈటీ వి.నరసింహారావు, హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు, సర్పంచ్ చొల్లంగి శివాళినీ, కృష్ణార్జున, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

గోవా మద్యం స్వాధీనం

ఐ.పోలవరం, ఏప్రిల్ 2: కేశనకుర్రు నుంచి జి.వేమవరానికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం బాటిల్స్‌ను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దర్ని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు పోలీసులు తెలిపారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయాలి



రావులపాలెంలో చంద్రబాబు సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి అభ్యర్థి సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 2: రావులపాలెంలోని టీడీపీ కార్యాలయ సమీపంలో బుధవారం జరిగే చంద్రబాబు ప్రజాగళం సభను విజయవంతం చేయాలని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. చంద్రబాబు ఏపక్క నుంచి ప్రసంగించాలి, సభకు వచ్చే టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణులు ఎక్కడి నుంచి వీక్షించాలనే అంశంపై చర్చించారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభమవుతుందని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. బండారు సంజీవ్, చిలువూరి సతీష్ రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కాసా విజయసాగర్ పాల్గొన్నారు.

కొత్తపేట: రావులపాలెంలో చంద్రబాబునాయుడు ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు కోరారు. స్థానిక బండారు బులిసత్యం-చంద్రావతి కాపు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి సమావేశానికి ఆయన హాజరయ్యారు. జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణరంగారావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, వాసిరెడ్డి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు సభకు ఉమ్మడి పార్టీ శ్రేణులంతా అధిక సంఖ్యలో తరలివచ్చేలా కృషిచేయాలన్నారు. సమావేశంలో జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ పదాధికారి తమలంపూడి రామకృష్ణారెడ్డి, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మండపేట: రావులపాలెం, రామచంద్రపురంలో బుధవారం జరిగే చంద్రబాబు ప్రజాగళం సభలకు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టీడీపీ,జనసేన,బీజేపీ శ్రేణులను కోరారు. రావులపాలెంసభ తర్వాత చంద్రబాబు మండపేట మీదుగా రామచంద్రపురం వెళ్తారన్నారు.

టీడీపీలో చేరిన నరసాపురపుపేట సర్పంచ్, సభ్యులు



ద్రాక్షారామ, ఏప్రిల్ 2: నరసాపురపుపేట సర్పంచ్ చాట్రాతి వీరలక్ష్మి మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి వాసంశెట్టి సుబాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. 9మంది పంచాయతీ సభ్యులు కూడా టీడీపీలో చేరారు. వీరికి సుబాష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బడుగంటి చిన్నయ్య, మీనవల్లి శ్రీనివాస్, మీనవిల్లి దొరబాబు, చుండ్రు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 2: ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య పేర్కొన్నారు. కొత్తలంక, చినకొత్తలంక, మర్లపాలెం, క్రరివానిరేవు, అన్నంపల్లి, చింతపల్లి లంక గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయపెట్టినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, ఏప్రిల్ 2: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అంకంపాలేనికి చెందిన కరుటూరి పానకాలు-కృష్ణవేణి దంపతులు రూ.50వేలు విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా మంగళవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,29,629 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

రాయవరం, ఏప్రిల్ 2: మాచవరంలో మంగళవారం తహశీల్దారు కృష్ణారావు ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఎన్నికల నిబంధల ప్రకారం రూ.50వేలు మించి తీసుకువెళ్లరాదన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

మలికిపురం, ఏప్రిల్ 2: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉచిత పాలిసెట్‌కు, ఏపీ ఆర్జేసీ శిక్షణ విశ్వేశ్వరాయపురం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఇవ్వనున్నట్టు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. శిక్షణలో పాల్గొన్న అందరికీ సూర్యచంద్ర చారిటబుల్ ట్రస్టు అధినేత వాసుసాయిరామ్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లిస్తారని చెప్పారు. స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. గుబ్బల సింహాచలం, ఎస్.ఉమామహేశ్వరావు, కొప్పాడి శ్రీను, కటకం రవి, దొంగ శివకృష్ణ, పెచ్చెట్టి కిశోర్ పాల్గొన్నారు.

8తో ముగియనున్న పదో తరగతి మూల్యాంకనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 2: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల8న ముగుస్తుందని డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలురు, బాలికోన్నత పాఠశాలల్లో మూల్యాంకన ప్రక్రియ చేపట్టగా జిల్లాకు 1,88,751జవాబు పత్రాలు చేరుకున్నాయన్నారు. మంగళవారం మూల్యాంకనం పూర్తయిన అనంతరం సిబ్బందితో డీఈవో కమలకుమారి సమీక్షించారు. మూల్యాంకనానికి చీఫ్ ఎగ్జామినర్లుగా 101 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లగా 601, స్పెషల్ అసిస్టెంట్లుగా 201 మందిని, కోడింగ్ విధులకు 25మందిని నియమించినట్టు చెప్పారు.

యానాం చేరుకున్న కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం

యానాం, ఏప్రిల్ 2: పుదుచ్చేరి లోకసభ స్థానానికి ఈనెల19న ఎన్నికల జరగనున్నాయి. మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.వైద్యలింగం, మాజీ సీఎం నారాయణస్వామి బృందం యానాం చేరుకున్నారు. తొలుత వారికి రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద కాంగ్రెస్ పార్టీ యానాం ప్రతినిధులు మల్లాడి సత్తిబాబు, ఆర్ధాని దినేష్, కాటంశెట్టి రామూర్తి స్వాగతం పలికారు. యానాం బైపాస్ జంక్షన్‌లోని ఆనంద్ రీజెన్సీలో బస చేశారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు వైద్యనాథన్, పెద్ద సత్యపెరుమాళ్లు యానాం వచ్చారు. ఈసందర్భంగా వారిని కాంగ్రెస్ ప్రతినిధులు సత్కరించారు.

5 నుంచి అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, ఏప్రిల్2: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం తిరుమంజన సేవాకాలం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ముందుగా ఈనెల5 నుంచి 9వరకు అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

కపిలేశ్వరపురం, ఏప్రిల్2: మోటార్‌సైకిల్ చోరీకేసులో సోమవారంఅంగరకు చెందిన మోటుపల్లి సురేంద్ర, కోరుమిల్లికి చెందిన సుంకర నరేష్‌లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసు కుని, వారికి ఆలమూరు కోర్టుకు రిమాండ్ విధించినట్టు మంగళవారం తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆత్రేయపురం, ఏప్రిల్2: ఆత్రేయపురం, మెర్లపాలెం, ర్యాలి గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు వెంకట్రామయ్య, ఎస్ఐ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంఈవో సాహెబ్, వీఆర్వో, బీఎల్వోలు వున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

అయినవిల్లి, ఏప్రిల్ 2: వీరవల్లిపాలెంలో శ్రీబాలదుర్గాదేవి, వేంకటేశ్వరస్వామి, ధనలక్ష్మి, అయ్యప్పస్వామి, గణపతి, సింహవాహన ప్రతిష్ఠల సందర్భంగా మంగళవారం పూజలు నిర్వహించారు. శైవాగమ ప్రతిష్ఠాపన పండితులు వెలువలపల్లి కామేశ్వరశర్మ బ్రహ్మత్వంలో స్థానిక అర్చకస్వామి అంగర రామానుజాచార్యులు పర్యవేక్షణలో పూజలు వైభవంగా ప్రారంభించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.

దేవగుప్తం వలంటీర్ రాజీనామా

అల్లవరం, ఏప్రిల్2: వలంటీర్ల సంఘమండల అధ్యక్షుడు, దేవగుప్తం వలంటీరు పెనుమాల రాహుల్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఎన్నికల కమిషన్ ఆంక్షలతో ఈనిర్ణయం తీసుకున్నట్టు చెప్పాడు. రాజీనామా లేఖను ఎంపీడీవో కృష్ణమోహన్ కార్యదర్శి పిల్లి శ్రీనివాసులకు అందించాడు.

మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ

కాట్రేనికోన, ఏప్రిల్ 2: వైసీపీ కార్యకర్త సంగాని వీరబాబును ఈనెల ఒకటో తేదీన మరోవర్గం మద్యం మత్తులో దాడికి పాల్పడింది. వీరబాబు కేకలు వేస్తుండగా అతని తల్లిదండ్రులు గంగాధర్, సత్యవతి అడ్డువెళ్ళగా సత్యవతికి గాయాలయ్యాయి. సత్యవతిని ఆసుపత్రికి తరలించారు. కాగా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న సంగాని వీరబాబు తమతో గొడవకు దిగడంతో ఘర్షణ జరిగిందని, సత్యవతి మధ్యగా రావడంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయని, ఈగొడవలకు, పార్టీలకు ఎటువంటి సంబంధం లేదని మరో వర్గం వాదన.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పదేళ్లు ప్రత్యేకహోదా

పి.గన్నవరం, ఏప్రిల్ 2: ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదా వస్తుందని, తద్వారా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు, రాష్ట్రానికి ఆదాయం వస్తుందని పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జంగా గౌతమ్ తెలిపారు. లంకలగన్నవరంలో నియోజకవర్గ కన్వీనర్ వంటెద్దు బాబి అధ్యక్షతన జరిగిన పార్టీ బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం రూ.12లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించిన సీఎం జగన్‌కు ఓటు అడిగే నైతిక హక్కు కోల్పోయారన్నారు. దేశంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. దోపిడీ ప్రభుత్వాలను సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరి మాచవరపు శివన్నారాయణ, చిట్టాల రామజోగేశ్వరావు, నెల్లి వెంకటరమణ, వడ్డి నాగేశ్వరావు, అప్పన శ్రీరామమూర్తి, ములపర్తి మోహనరావు, నీతిపూడి బాలసత్యనారాయణ పాల్గొన్నారు.

69 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలింగ్

యానాం, ఏప్రిల్ 2: యానాంలో మంగళవారం దివ్యాంగులు, 85ఏళ్ల పైబడి ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. యానాంలో 977మంది ఓటర్లు ఉండగా 302 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం నుంచి శనివారం వరకు ఐదు బృందాలు ఇంటింటికీ వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సేకరిస్తారు. మంగళవారం 69ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల శాఖ పర్యవేక్షణలో జరుగుతున్న ఈకార్యక్రమాన్ని యానాం అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ ఆర్.మునిస్వామి పర్యవేక్షించారు.